# కానిస్టేబుల్ సస్పెన్షన్



సామాజిక మాధ్యమాలలో టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) పార్టీ అధ్యక్షురాలు కవితపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన పోలీస్ కానిస్టేబుల్ పై వేటు పడింది. 2018 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ కే అనిల్ ప్రస్తుతం సైబరాబాద్ సీఏఆర్ నుంచి ఆర్డర్ టు సర్వ్‌లో భాగంగా హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తుడు. ఇటీవల సోషల్ మీడియాలో కవితనుద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ రమేష్.. కానిస్టేబుల్ అనిల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ, వృత్తిపరమైన ప్రవర్తన, గౌరవప్రదమైన వ్యవహారశైలిని పాటించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో కూడా పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. - (నవతరం, హైదరాబాద్)


# నవతరం

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2018/76747

## జిల్లా అనుబంధం

NAVATARAM | PAGES: 05 | TABLOID 04-09-2026


## కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు



**హైదరాబాద్, నవతరం:** 'ది పయోనీర్' పత్రిక వ్యవహారంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ పత్రికపై పరువు నష్టం ఆరోపణలు చేయొద్దని ఆమెను ఆదేశించింది. కవితతో పాటు మరో 14 మంది జర్నలిస్టులు, యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపైనా కోర్టు ఆంక్షలు విధించింది.

## పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి

**హైదరాబాద్, నవతరం:** మంత్రి కొండా సురేఖ ను బర్తరఫ్ చేయడంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అంతిమమని, దానికి అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖకు సంబంధించిన పూర్తి నివేదిక హైకమాండ్ వద్ద ఉంది. పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టుబడి ఉండాలని ఆయన అన్నారు. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలను కాంగ్రెస్ అధిష్ఠానమే పర్యవేక్షిస్తుందన్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని, సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు.





## యుద్ధ వీరుడి సరికొత్త బాధ్యతలు

2019 బాలాకోట్ వైమానిక దాడుల సమయంలో పాకిస్థాన్‌కు చెందిన అత్యాధునిక ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చివేసి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న భారత వైమానిక దళ (IAF) మాజీ గ్రూప్ కెప్టెన్, వీరచక్ర గ్రహీత అభినందన్ వర్ధమాన్ సరికొత్త బాధ్యతలు చేపట్టారు. 43 ఏళ్ల అభినందన్ ఈ ఏడాది మార్చిలో ఐఏఎఫ్ నుంచి పదవీ విరమణ పొందిన తర్వాత, గత నెలలో ప్రముఖ ప్రాంతీయ విమానయాన సంస్థ 'ఫ్లై91' (FLY91)లో పైలట్‌గా చేరినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే ఆయన ప్రస్తుత విధుల వివరాలను వెల్లడించడానికి ఉద్యోగుల వ్యక్తిగత గోప్యత కారణాల దృష్ట్యా ఆ సంస్థ ప్రతినిధి నిరాకరించారు. ఫిబ్రవరి 2019లో జరిగిన తీవ్ర వైమానిక పోరులో మిగ్-21 బైసన్ విమానాన్ని నడుపుతూ శత్రుదేశపు ఎఫ్-16 విమానాన్ని కూల్చిన ఏకైక పైలట్‌గా అభినందన్ రికార్డు సృష్టించారు. ఆ సమయంలో తన విమానం కూడా దెబ్బతినడంతో పారాచూట్ ద్వారా పాక్ ఆక్రమిత భూభాగంలో దిగిన ఆయన, మూడు రోజుల పాటు పాకిస్థాన్ సైన్యం చెరలో ఉండి అనంతరం దౌత్యపరమైన ఒత్తిడితో స్వదేశానికి సురక్షితంగా చేరుకున్నారు. అప్పట్లో వింగ్ కమాండర్‌గా ఉన్న ఆయన ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలకు గుర్తింపుగా 2021లో భారత ప్రభుత్వం 'వీరచక్ర' పురస్కారంతో సత్కరించడమే కాకుండా, ఐఏఎఫ్ ఆయనను గ్రూప్ కెప్టెన్‌గా పదోన్నతి కల్పించింది. మార్చి 2024 నుంచి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించిన 'ఫ్లై91' ఎయిర్‌లైన్స్ ప్రస్తుతం గోవా, హైదరాబాద్ కేంద్రాలుగా ఆరు ఏటీఆర్ 72-600 విమానాలను నడుపుతోంది. ఇప్పుడు ఈ సంస్థలోనే అభినందన్ వర్ధమాన్ పైలట్‌గా తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు.



# వరదల్లో అదృశ్యమై.. వారం తర్వాత వచ్చాడు



నేపాల్‌లోని రసువా జిల్లాలో సంభవించిన పెను వరదల నుంచి పల్పా జిల్లాకు చెందిన భీమ్ బహదూర్ సోమ్ ప్రాణాలతో బయటపడ్డారు. 10వ తేదీ ఉదయం రసువాలో అకస్మాత్తుగా విరుచుకుపడిన వరద ప్రవాహం క్షణాల వ్యవధిలోనే ప్రజలను, భవనాలను ముంచెత్తింది. సోమ్ పనిచేస్తున్న ఆర్‌వి డిపార్ట్‌మెంట్ స్టోర్ భవనంతో పాటు అందులోని వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. కొండలపైకి పారిపోవడం ద్వారా తాను ప్రాణాలు దక్కించుకున్నానని, ఆపై పునరావాస కేంద్రంలో ఉండిపోవడంతో మొబైల్ నెట్‌వర్క్ లేక కుటుంబ సభ్యులను సంప్రదించలేకపోయానని ఆయన తెలిపారు.మొబైల్ ద్వారా సమాచారం లభించకపోవడంతో పల్పాలోని ఆయన కుటుంబంలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఆచూకీ గల్లంతైన 11 మంది జాబితాలో సోమ్ పేరును చేర్చి, పల్పా జిల్లా యంత్రాంగం గాలింపు చర్యలు చేపట్టింది. వరదలు వచ్చిన ఐదు రోజుల తర్వాత ఆయన ఎట్టకేలకు కుటుంబ సభ్యులతో మాట్లాడగలిగారు. గతంలో డ్రైవర్‌గా పనిచేసిన ఆయన, మూడేళ్ల క్రితం ఆ ఉద్యోగం వదిలి ఆర్‌వి స్టోర్‌లో స్టోర్‌కీపర్‌గా చేరారు. మార్కెట్ మొత్తం కొట్టుకుపోవడంతో అక్కడ చేయడానికి పని కూడా లేకుండా పోయింది. కుటుంబానికి సమాచారం ఇచ్చినప్పటికీ తిరుగు ప్రయాణం సులువుగా సాగలేదు. ఎన్నో ఇబ్బందుల నడుమ ఖాట్మండు చేరుకోగా, కృష్ణభీర్ వద్ద కొండచరియలు విరిగిపడటంతో మార్గమధ్యంలోనే చిక్కుకుపోయారు. అనంతరం కొందరు యువకులతో కలిసి బస్సులో హెటౌడా మీదుగా పల్పా చేరుకున్నారు. వరద సంభవించిన ఏడు రోజుల తర్వాత ఆయన స్వగ్రామానికి చేరుకుని మిత్రులను కలుసుకున్నారు. 'అదృష్టం కొద్దీ ప్రాణాలతో బయటపడి ఇంటికి వచ్చాను; బతికుండటమే గొప్ప విషయం' అని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. పల్పా జిల్లా యంత్రాంగం తెలిపిన వివరాల ప్రకారం గల్లంతైన 11 మంది జాబితా నుంచి ఇద్దరి పేర్లను తొలగించగా, మరో తొమ్మిది మంది ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. వరదల్లో గల్లంతైన పల్పా నివాసి, నేపాల్ పోలీసు ఏఎస్సై దీపేంద్ర బిష్ట్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# నన్ను బెదిరిస్తే భయపడను



**హైదరాబాద్, నవతరం:** తననెవరూ బెదిరించవద్దని, బెదిరిస్తే భయపడనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం నిర్వ - హించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. "బెదిరిస్తే భయపడను. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

## ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి త్వరగా వంతెన పూర్తిచేసిందని చెప్పారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారన్నారు. "ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ. పాతబస్తీలో అణువణువూ నాకు తెలుసు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అది పూర్తయితే పర్యాటకంగా, రవాణాపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తిచేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తిచేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలను తొలగించి మురుగు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే.. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి నెలా రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం"అని రేవంత్ అన్నారు.

## రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు





అంతకుముందు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నారు. రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆయన తనదైన పంథాలో పరిపాలన చేయాలన్నారు.

# నిర్మాణపనుల్లో వేగం పెంచండి



**మెదక్, నవతరం:** గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, ఏడాదిలోగా భవనాలను విద్యార్థులకు అందుబాటు లోకి తీసుకురావాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. ఈ మేరకు మెదక్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవనాల నిర్మాణ పురోగతి, మెదక్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ పనితీరుపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా గురువారం సమీక్ష చేశారు. కోఠిలోని తెలంగాణ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) ఆఫీస్‌లో జరిగిన ఈ సమావేశంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవిందర్ నాయక్, మెదక్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, మెదక జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్, సంగారెడ్డి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సుమారు 40 కోట్ల రూపాయలతో నిర్మించిన సంగారెడ్డి నర్సింగ్ కాలేజీ భవనం ప్రారంభవానికి సిద్ధమైందని టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు మంత్రికి తెలిపారు. కాలేజీ బిల్డింగ్ ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సుమారు 156 కోట్ల రూపాయలతో చేపడుతున్న మెదక్ మెడికల్ కాలేజీ, హాస్టల్స్, నర్సింగ్ కాలేజీ భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పనుల్లో వేగం పెంచాలని, ఏడాదిలోగా అన్ని భవనాలను స్టూడెంట్స్‌కు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కాలేజీలు, హాస్టళ్లు కొనసాగుతున్నాయని.. వాటిల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని హెల్త్ సెక్రటరీ, డీఎంఈని మంత్రి ఆదేశించారు. వెంటనే వెళ్లి మెదక్ మెడికల్, నర్సింగ్ కాలేజీలు, హాస్టల్ భవనాలను విజిట్ చేయాలని డీఎంఈని మంత్రి ఆదేశించారు. అవసరమైతే, అన్ని సౌకర్యాలు ఉన్న ఇతర భవనాలను అద్దెకు తీసుకుని, హాస్టళ్లను అక్కడికి మార్చాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం పాత భవనంలోనే మెదక్ జనరల్ హాస్పిటల్ కొనసాగుతోందని, త్వరలోనే కొత్త హాస్పిటల్ భవనాలను మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.

# ఆకృతి చౌదరి కేసు.. కొట్టివేసిన అలహాబాద్ హై కోర్టు

నోయిడా కార్మికుల ఆందోళనల నేపథ్యంలో 25 ఏళ్ల ఢిల్లీ యూనివర్సిటీ హిస్టరీ గ్రాడ్యుయేట్ ఆకృతి చౌదరిపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విధించిన జాతీయ భద్రతా చట్టం (NSA) నిరోధక నిర్బంధాన్ని అలహాబాద్ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఈ నిర్బంధం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం అల్లిన ఒక "కల్పిత కథ" (Concocted Story) ఆధారంగా జరిగిందని ధర్మాసనం తీవ్రంగా తప్పుపట్టింది. మరే ఇతర కేసులోనూ ఆమె అరెస్టు అవసరం లేకపోతే, వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా, బాధితురాలికి రూ. 5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఆ మొత్తాన్ని బాధ్యులైన అధికారుల జీతాల నుంచే వసూలు చేయాలని స్పష్టం చేసింది.వివరాల్లోకి వెళ్తే..గత ఏప్రిల్‌లో నోయిడాలో వేతనాల పెంపు, మెరుగైన పని వసతుల కోసం సుమారు 40 వేల మంది ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన నిరసనలు తీవ్ర హింసాత్మకంగా మారాయి. నిరసనకారులు వాహనాలకు నిప్పు పెట్టడం, పోలీసులపై రాళ్లు రువ్వడం వంటి ఘటనలు జరిగాయి. ఈ హింసను ఆకృతి చౌదరి రెచ్చగొట్టారంటూ మే 13న యూపీ పోలీసులు ఆమెపై ఎన్ఎస్ఏ చట్టాన్ని ప్రయోగించారు. దీనిని సవాలు చేస్తూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను జస్టిస్ అతుల్ శ్రీధరన్, జస్టిస్ అచల్ సచ్‌దేవ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది.

**పోలీసుల తీరుపై కోర్టు ఆగ్రహం:** ఆకృతి చౌదరి నిరసనకారులను రెచ్చగొట్టినట్లు చూపించే ఎలాంటి వీడియో ఆధారాలను సమర్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆమె ఇప్పటికే ఐదు నెలలుగా జైల్లో ఉన్నందున, వీడియోలు చూపించడానికి ప్రభుత్వానికి మరింత సమయం ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (BNSS) నిబంధనల ప్రకారం ఆమెకు నోటీసులు కూడా సరిగ్గా ఇవ్వలేదని, నోటీసు తయారు కాకముందే ఆమెను అరెస్టు చేసినట్లు జనరల్ డైరీ ఎంట్రీలు స్పష్టం చేస్తున్నాయని కోర్టు పేర్కొంది. అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఈ కీలక తీర్పునిచ్చింది.

## బళ్లారికి బదిలీ..

# ఎం.శతమ్మపై వేటు

**కర్ణాటక, నవతరం:** విచారణ ఖైదీ అయిన శ్రీరంగపట్న ప్రభుత్వ అధికారి మహమ్మద్ హుస్సేన్‌కు సహాయం చేశారని, జైలులో డబ్బు చెల్లిస్తే రాజమర్యాదలు అందిస్తారని ఆరోపణలు రావడంతో జిల్లా జైలు ప్రధానాధికారి ఎం.శతమ్మను జైళ్ల చీఫ్ అలోక్ కుమార్ బళ్లారి సెంట్రల్ జైలుకు బదిలీ చేశారు. జైలులో అక్రమాలపై ఖైదీలు రాసినట్లుగా భావిస్తున్న ఒక లేఖ వైరల్ అయిన తర్వాత ఈ ఉత్తర్వు వెలువడింది. ఫోర్జరీ విచారణ ఖైదీగా ఉన్న మహమ్మద్ హుస్సైన్ అనారోగ్యం లేకున్నా జబ్బు సాకుతో మిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. అక్కడ ప్రత్యేక గదిలో ప్రియురాలితో గడుపుతుండగా కొందరు గుట్టురట్టు చేశారు. జిల్లా సెషన్స్ జడ్జి బృందం ఆసుపత్రిని తనిఖీ చేసి విచారించారు. ఈ కేసులో శతమ్మ నిర్లక్ష్యం స్పష్టం కావడంతో బళ్లారి జైలుకు బదిలీ చేసి ఆమె స్థానంలో ఫక్కీరప్ప బరకర్‌ను నియమించారు.

# కాప్రా చెరువు మినహా..

## మిగతా అన్ని చెరువుల్లో నిమజ్జనాలుంటాయి



**హైదరాబాద్, నవతరం:** ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే నిమజ్జనోత్సవాలకు హైడ్రా సర్వం సన్నద్ధమౌతోంది. పండగ వాతావరణంలో జరిగే ఈ వేడుకలు సజావుగా సాగేలా సంబంధిత శాఖలన్నిటితో సమన్వంగా హైడ్రా పని చేయనుంది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కాప్రా చెరువు మినహా నగరంలోని మిగతా అన్ని చెరువుల్లో గణేష్ నిమజ్జనాలకు ఎలాంటి అభ్యంతరాలు లేవని గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. హైడ్రా అభివృద్ధి చేస్తున్న మిగతా చెరువులలో కూడా ఎలాంటి అభ్యంతరాలు లేవని హైడ్రా పేర్కొంది. హైడ్రా అభివృద్ధి చేస్తున్న చెరువుల్లో నిమజ్జనాలను అనుమతించడంలేదని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేసింది. కాప్రా చెరువు నేషనల్ వెట్ ల్యాండ్స్ జాబితాలో ఉన్నందున.. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా ఆంక్షలున్నట్టు తెలిపింది. అయితే ఇక్కడ బేబీ పాండ్‌లో 5 అడుగుల విగ్రహాల వరకూ నిమజ్జనం చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. జీవవైవిద్యానికి (బయోడైవర్సిటీ) ప్రతీకగా చరిత్రకెక్కిన కాప్రా చెరువు.. సాధారణ నీటి వనరు మాత్రమే కాదు.. నగర పర్యావరణ సమతుల్యతకు కీలకమైన వెట్‌ల్యాండ్ అని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసింది. ఆస్ట్రేలియా, యూరప్‌తో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 470కు పైగా వలస పక్షులకు ఆవాసంగా ఈ చెరువుంది. వెట్ ల్యాండ్స్ పరిరక్షణ, నిర్వహణ రూల్స్ 2017 ప్రకారం చెరువు హద్దులు నిర్ధారించడం, ఆక్రమణలు జరగకుండా చూడడం, కాలుష్యం నుంచి కాపాడడం వంటి బాధ్యతలున్నాయి. ఇందుకు అందరూ సహకరించాలి. ఈ క్రమంలోనే 113 ఎకరాల కాప్రా చెరువును హైడ్రా అభివృద్ధి చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కాప్రా చెరువులో గణేష్ నిమజ్జనం సరికాదని.. అందరూ ఈ విషయంలో సహకరించాలని విజ్ఞప్తి చేసింది. పెద్ద విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించింది.

# గణేష్ నిమజ్జనానికి హైడ్రా సన్నాహం

**హైదరాబాద్, నవతరం:** నగరంలో గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు హైడ్రా విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే వివిధ శాఖలతో కలిసి గణపతి విగ్రహాలు సులభంగా మండపాలకు చేరేందుకు వీలుగా అన్ని మార్గాల్లో చెట్టు కొమ్మలను తొలగించే పనులు నిర్వహిస్తోంది. ఇదే క్రమంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిమజ్జనోత్సవాలకు కూడా సన్నద్ధమౌతోంది. ఓ ఆర్ ఆర్ పరిధిలో జీహెచ్ ఎంసీ, సీఎంసీ పరిధిలో 47 చొప్పున మొత్తం 94 చెరువుల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు జరగనుండగా.. ఎంఎంఎసీ పరిధిలో మొత్తం 9 చెరువుల్లో ఈ కార్యక్రమం ఉంటుంది. ఇలా మూడు కార్పొరేసణ్ణ పరిధిలోని 103 చెరువుల్లో నిమజ్జనోత్సవాలకు మూడు మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాట్లు చేయగా.. అక్కడ వివిధ శాఖలతో కలిసి పని చేసేందుకు 51 డీఆర్ ఎఫ్ బృందాలు రంగంలోకి దిగుతున్నాయి. వీరికి తోడు 21 బైకు బృందాలు కూడా క్షేత్రస్థాయిలో ఉండి గణేష్ నిమజ్జనోత్సవానికి ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటాయి. ఈ ఏర్పాట్లను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు గురువారం సమీక్షించారు. నిమజ్జనోత్సవాల్లో ఎక్కడా ఎలాంటి అవాంతరం ఏర్పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సెప్టెంబర్ 25, 26 తేదీల్లో నిమజ్జన కార్యక్రమం భారీగా జరిగే అవకాశం ఉండటంతో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. శిక్షణ పొందిన స్విమ్మర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు.

**భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా..**

నిమజ్జనోత్సవానికి హైడ్రా తరఫున సన్నహాక కార్యక్రమాలను హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్య గారు వివరించారు. మొత్తం 394 మంది గజ ఈతగాళ్లను హైడ్రా తరఫు నుంచి సిద్ధం చేసినట్టు తెలిపారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా వీరు నీటిలో, పరిసర ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించనున్నారు. ప్రతి నిమజ్జన కేంద్రంలో పరిస్థితులకు అనుగుణంగా DRF బృందాలు, రక్షణ పరికరాలు, స్విమ్మర్లు అందుబాటులో ఉండేలా HYDRAA సమన్వయం చేస్తోంది. భక్తులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, నిమజ్జన వేడుకలను సురక్షితంగా నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేస్తున్నారు. హుస్సేన్ సాగర్‌లో ప్రతి షిఫ్టులో 50 మంది గజ ఈతగాళ్లు విధులు నిర్వహించనున్నట్టు చెప్పారు. పర్యాటక శాఖకు చెందిన బోట్లుతో పాటు.. హైడ్రాకు చెందిన 6 బోట్లను కూడా వినియోగిస్తామన్నారు. దుర్గం చెరువు, ఐడీఎల్ చెరువు, మల్కం చెరువు, గంగారం చెరువు, లింగం చెరువు, దుండిగల్ పెద్దచెరువు ఇలా అవసరమైన చోట్ల గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు. గ్రేటర్ హైదరబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ ఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్( సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లతో కలసి హైడ్రా సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు.

# బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు: శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలనే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతున్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దంపడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, ఒక బలమైన బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు.

# నాకు మరణశిక్ష విధించండి



**జమ్ము - కశ్మీర్, నవతరం:** నిషేధిత జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) అధినేత యాసిన్ మాలిక్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 1990లో జరిగిన కశ్మీర్ పండిట్ సర్లా భట్ హత్య కేసులో తనకు ఎటువంటి ప్రమేయం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో తాను న్యాయపోరాటం చేయదలుచుకోలేదని, తనపై మోపిన ఆరోపణల నేపథ్యంలో తనకు మరణశిక్ష విధించాలని కోరుతూ శ్రీనగర్‌లోని ప్రత్యేక కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రస్తుతం యాసిన్ మాలిక్ ఢిల్లీలోని తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.

ఈ అఫిడవిట్‌లో తన భార్యతో వైవాహిక బంధాన్ని కూడా ముగిస్తున్నట్లు మాలిక్ ప్రకటించడం గమనార్హం. 1990 ఏప్రిల్‌లో సర్లా భట్ హత్యకు గురికాగా, ఈ దర్యాప్తులో భాగంగా దర్యాప్తు సంస్థ ఈ ఏడాది జూన్‌లో యాసిన్ మాలిక్ పేరును నిందితుడిగా చేర్చుతూ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే, ఈ ఆరోపణలను యాసిన్ మాలిక్ పూర్తిగా ఖండించారు. హత్య జరిగిన సమయంలో తాను ఒక భవనంపై నుంచి పడిపోయి కోమాలో ఉన్నానని, అటువంటి స్థితిలో హత్యకు ప్రణాళిక రచించడం అసాధ్యమని తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గతంలో ఈ కేసులో తన పేరు ఎక్కడా లేదని, ఇప్పుడు రాజకీయ ప్రేరేపితంగా కట్టుకథలు సృష్టించి తనను ఇరికించారని ఆరోపించారు.

# కేఏ పాల్ ఓపెన్ ఆఫర్



**హైదరాబాద్, నవతరం:** ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. మంత్రి పదవిని కోల్పోతున్న కొండా సురేఖకు కేఏ పాల్ బహిరంగ ఆఫర్ ఇస్తూ... తమ ప్రజాశాంతి పార్టీ తలుపులు ఆమె కోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని, వేరే ఏ ఇతర పార్టీల్లోకీ వెళ్లవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్డి నేతల పదవులకే భద్రత ఉంటుందని... బీసీ, బడుగు, బలహీన వర్గాల నేతల పదవులకు ఎప్పుడూ ప్రమాదం పొంచి ఉంటుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.

కాంగ్రెస్‌లో బీసీ నాయకులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించిన కేఏ పాల్.. బడుగు వర్గాలకు నిజమైన న్యాయం జరగాలంటే ప్రజాశాంతి పార్టీయే ఏకైక వేదిక అని చెప్పారు. కొండా సురేఖ కాంగ్రెస్ వీడి తమ పార్టీలోకి వస్తే తగిన గౌరవం, ఉన్నతమైన స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సురేఖ కేబినెట్ నుంచి బయటకు రావడం ఖాయమనే ప్రచారం ముమ్మరమైన వేళ, కేఏ పాల్ చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి.

## జైశంకర్‌తో భేటీ..

# భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు. జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది. భారత్-ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు. జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.



### "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"..

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, నవతరం:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల



కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమి లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## 39వ రోజు.. టీడీపీ 'ఇంటింటికీ తెలుగుదేశం'

**అమరావతి, నవతరం:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం-2026' కార్యక్రమం కోటి ఇళ్ల మైలురాయికి చేరువలో ఉంది. గత 39 రోజులుగా విజయవంతంగా కొనసాగుతున్న ఈ పర్యటనల్లో భాగంగా గురువారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 99.85 లక్షల కుటుంబాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఒక్క గురువారం నాడే 1,32,987 ఇళ్లను సందర్శించడం గమనార్హం. కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. ఇంటింటి పర్యటనల ద్వారా టీడీపీ శ్రేణులు ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిస్తూ, లబ్ధిదారుల నుంచి ప్రత్యక్షంగా స్పందనను సేకరిస్తున్నారు. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు, వారి అవసరాలను సైతం పార్టీ ప్రతినిధులు నమోదు చేసుకుంటున్నారు. ఈ వివరాలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు టీడీపీ వర్గాలు వెల్లడించాయి.




### అక్టోబర్ నెలలోనే..

## స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

**అమరావతి, నవతరం:** రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.